క్లుప్తంగా

అమ్మవారి వైభవంపై ప్రవచనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై సోమవారం అమ్మవారి వైభవంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై బాపట్ల సమీపంలోని అద్దంకికి చెందిన కె.రమాసుందరి అమ్మవారి నామ విశిష్టత, అమ్మవారి అభరణాల విశిష్టతతో పాటు నామ విశిష్టత గురించి చక్కటి వ్యాఖ్యానంతో వివరించారు. అనంతరం ప్రవచనకర్తకు అమ్మవారి దర్శనం కల్పించి అధికారులు ప్రసాదాలు అందజేశారు.

రైల్వే ఎన్నికలో సహకరించాలి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):త్వరలో జరగనున్న రైల్వే ట్రేడ్ యూనియర్ ఎన్నికల్లో తమకు సహకరించాల్సిందిగా దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం నేతలు సోమవారం ఆలిండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గుటాల పాపారావును ఆయన కార్యాలయంలో కలిసి కరపత్రాన్ని అందజేశారు. కార్మిక సంఘం డివిజన్ సెక్రటరీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గుటాల పాపారావును మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిసెంబర్‌లో జరిగే రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో తమకు సహకరించాల్సిందిగా అయన్ను అభ్యర్థించగా అందుకు సానుకూలం తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే కార్మిక్ సంఘ్ డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ. విజయసాగర్, నేతలు కంది కార్తీక్, కోదండ రామ్ తదితరులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్రంలో విద్యార్థులు రాణించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):జిల్లాలోని ప్రభు త్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు భౌతికశాస్త్రంలో మరింతగా రాణించే దిశగా తీర్చిదిద్దాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ తెలిపారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న పదో తరగతి వారికి భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నగరంలో జరుగుతుంది. అందులో భాగంగా మైనం హుస్సేన్ మాట్లాడుతూ నూతన పాఠ్య పుస్తకం, రాబోయే ఎస్ఎస్‌సీ పరీక్షల ప్రశ్నాపత్రం తదితర అంశాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను ఎలా నివృత్తి చేయాలనే అంశాలపై వివరిస్తామని చెప్పారు. అలాగే విద్యార్థులకు మంచి మార్కులు రావటంతో పాటుగా నూరు శాతం ఫలితాలను సాధించేందుకు కృషి జరగాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, అధికారులు రావి అరుణ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కులమతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలను నిర్వహించటం అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, పశ్చిమ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బాషి ఆధ్వర్యంలో వించిపేటలో నిర్వహించిన గ్యార్మీ వేడుకలకు షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసిఫ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జరిగే ఈ విధమైన వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. ఇదే స్ఫూర్తితో అందరూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భగవంతుడు దయతో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షాహి మసాదు ఇమామ్ ఖాదీర్, నాయకులు కొరగంజి భాను, కర్రి గౌరి, మన్సూర్ హుస్సేన్, సయ్యద్ అతీక్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

ధనత్రయోదశి సందడి ప్రారంభం

- నేటి ఉదయం నుంచి త్రయోదశి తిథి ప్రారంభం
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న దుకాణాలు
- గ్రాము బంగారం, మజూరీలపై 50 నుంచి రూ.250 వరకూ రాయితీ
- కొనుగోళ్లపై బంగారు నాణేలు అందిస్తున్న దుకాణాలు
- సెంటిమెంట్‌తో దుకాణాల బాట పడుతున్న వినియోగదారులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని బంగారు దుకాణాలు భారీ వ్యాపారానికి సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆకర్షణీయమైన అలంకరణ, విస్తృతమైన ఆఫర్లతో నగరంలోని దుకాణాలు కళకళలాడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ధనత్రయోదశి ఘడియలు ప్రారంభం కానున్నాయి. ధనత్రయోదశిని పురస్కరించుకొని నగరంలోని బంగారు ఆభరణాలు విక్రయించే దుకాణాలు పలు ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. బుధవారం మధ్యాహ్నం వరకూ త్రయోదశి ఉండటంతో భారీగా వ్యాపారం జరగనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వినియోగదారులను తమ దుకాణాలకు రప్పించేందుకు వాటి యజమానులు షాపులను సర్వాంగసుందరంగా అలంకరించారు. దీపావళి పర్వదినానికి ముందు వచ్చే త్రయోదశిని, ధనత్రయోదశిగా ఉత్తరాదిన ధన్‌తేరస్‌గా పిలుస్తారు. ఆ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఆ సంవత్సరమంతా మంచి ఆదాయమంటుందని ప్రజల నమ్మకం. ప్రజల సెంటిమెంట్‌తో దుకాణాలు విభిన్న మోడల్స్, వివిధ ఆఫర్లతో నగరవాసులను రప్పించేందుకు ఆయా దుకాణాలు భారీ ప్రకటనలు ఇచ్చాయి. ప్రపంచంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూసే దేశాలే అధికం. కానీ భారతీయ సంస్కృతిలో బంగారానికి ప్రత్యేక స్థానం. భారతీయుల ఇంట ఏ శుభకార్యం జరిగినా అందులో బంగారం ప్రస్తావన లేకుండా అది పూర్తికాదనే చెప్పాలి.

దశాబ్దకాలంగా విస్తృత ప్రచారం...

ధనత్రయోదశి రోజున బంగారం కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందని, రానున్న రోజుల్లో చక్కని ఆదాయం ఉంటుందని కొంతమంది నమ్మకం. ఆదాయం వృద్ధి చెందుతుందనే అంశానికి సంబంధించి నిర్దిష్టమైన పౌరాణికగాథ లేకున్నా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ అభిప్రాయం బలంగా ఉంది. గడిచిన దశాబ్ద కాలంగా దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా మన రాష్ట్రంలో అక్షయతృతీయ, ధనత్రయోదశి పర్వదినాలను వ్యాపార సంస్థలు బాగా ప్రచారం చేస్తున్నాయి. తత్ఫలితంగా దేశం వ్యాప్తంగా ధనతేరస్‌కు సంబంధించిన నమ్మకం బలపడింది. ఈ రెండు రోజుల్లో వందల కోట్ల వ్యాపారం జరుగుతుంది.

భారీ వ్యాపారం...



నగరంలోని పలు కార్పొరేట్ దుకాణాల్లో సంవత్సరం మొత్తం జరిగే అమ్మకాల్లో అక్షయ తృతీయ, ధన్‌తేరస్సు రోజుల్లోనే 15 నుంచి 20 శాతం వ్యాపారం జరుగుతుందని వ్యాపారుల అంచనా. దీపావళికి లక్ష్మీపూజ నిర్వహించడం భారతీయుల సంప్రదాయం. దేశంలో దక్షిణాది కన్నా ఉత్తరాదినే ఈ సంప్రదాయం బాగా కనిపిస్తుంది. లక్ష్మీపూజ కొన్ని ప్రాంతాల్లో మూడు రోజుల పాటు చేస్తారు. ఆశ్వీయుజ బహుళ త్రయోదశి నుంచి అమావాస్య రోజు వరకూ ఈ పూజా కార్యక్రమం కొనసాగుతుంది. అందులో భాగంగానే ధనతేరస్ హడావుడి కూడా ఇటీవల మనకు కనిపిస్తుంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకూ త్రయోదశి ఘడియలు ఉండటంతో వ్యాపారులు భారీ వ్యాపారానికి సమయుత్తమవుతున్నారు.

నగరంలో ఆకట్టుకుంటున్న ఆఫర్లు....

ధనత్రయోదశి సందర్భంగా ఆయా దుకాణాలు ప్రకటించిన ఆఫర్లు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వజ్రాభరణాలకు కూడా ప్రత్యేక రాయితీలను ప్రకటించాయి. నగరంలో చాలా దుకాణాలు ఆరు శాతం నుంచి తరుగు లెక్కిస్తామని చెప్పినా వాస్తవంగా పది నుంచి 22 శాతం వరకూ తరుగును లెక్కగడుతుంటాయి. కానీ ప్రస్తుతం ధనతేరస్ సందర్భంగా ఒక్కొక్క దుకాణం గ్రాముకు బంగారంపైన కొన్ని దుకాణాలు, మజూరీపైన మరికొన్ని దుకాణాలు రూ.50 నుంచి రూ.300 వరకూ రాయితీనిస్తున్నాయి. అలాగే కొన్ని దుకాణాలు ఎంత బంగారం కొంటే అంతే బరువు వెండి ఉచితంగా అందిస్తున్నాయి. వినియోగదారులు ఆయా దుకాణాలు ప్రకటిస్తున్న రాయితీలను పరిశీలించి కొనుగోలు చేస్తే మంచి రాయితీని పొందవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాకుండా కొన్ని దుకాణాలు మజూరీలో 10 నుంచి 50 శాతం అని రాయితీ ప్రకటించాయి. అలాగే చాలా దుకాణాలు బంగారు నాణెలను అందిస్తున్నట్లు ప్రకటించాయి.

రహదారిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఏడీసీపీ జి.రామకృష్ణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రహదారిని ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీసీపీ జి.రామకృష్ణ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని తారాపేట రైల్వేస్టేషన్ సమీపంలోని నెహ్రూరోడ్డు, గద్దబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమించిన దుకాణదారులను హెచ్చరించి సరుకులను తొలగించారు. వినని దుకాణదారుడి సామగ్రిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆటోవాలాలను హెచ్చరించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. అదేవిధంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బారికేడ్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ఏడీసీపీ రామకృష్ణ మాట్లాడుతూ దుకాణాయజమానులు తమ సరుకులతో రహదారిని ఆక్రమిస్తే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటుగా శాంతిభద్రతల సమస్యలకు కారణమవుతున్నారన్నారు. అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఎన్ఎస్‌వీకే దుర్గారావు, సీఐ గురుప్రకాష్ ఇతర ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి బైపాస్ రోడ్డులోని వెన్నెల బార్ సమీపంలోని టీవీఆర్ఎం టవర్స్ ఎదురుగా రోడ్డుపక్కన గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తలకు బలమైన గాయమై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. లైట్ బ్లూ, తెల్ల చారల టీ షర్ట్ ధరించి ఉన్నాడు. రోడ్డుకు అటు ఇటు వరుసగా వైన్ షాపులు, బార్‌లు ఉన్నాయి. వాటిలో మద్యం సేవించి నిత్యం రోడ్డుపక్కన ఎవరో ఒకరు పడిపోతుంటారు. అలా పడిపోతే రోడ్డు మార్జిన్‌లో పార్క్ చేసే వాహనాలు ఏమైనా ఎక్కి ఉంటాయా? యాక్సిడెంటా? లేదా ఏదైనా దాడి జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ

పాయకాపురం(విజయవాడరూరల్):ప్రస్తుత జీవన విధానంలో ఆయుర్వేద ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంటు డైరెక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూ రాజీవ్‌నగర్, పాయకాపురంలోని సంస్థలో 9వ ఆయుర్వేద దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద ఆహారపు అలవాట్లు రోగాల బారిన పడకుండా మనిషి ఆయుష్‌ను పెంపొందిస్తాయని చెప్పారు. ఆయుర్వేద ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ సంస్థ నుంచి బయలుదేరి ప్రకాష్‌నగర్ మీదుగా నున్న పోలీసు స్టేషన్ వరకు సాగింది.

నానో టెక్నాలజీలో ఆవిష్కరణలు తీసుకురావాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మూర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రసాయనశాస్త్ర విద్యార్థులు నానో టెక్నాలజీ ద్వారా మరిన్ని ఆవిష్కరణలు తీసుకురావాలని మిట్ వరల్డ్ పీస్ యూనివర్సిటీ (పుణే) డిపార్ట్‌మెంట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ మూర్తి ఎస్ఎస్ఎస్ చావాలి యాదవ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నానో మెటీరియల్స్ అండ్ అప్లికేషన్స్' అంశంపై సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ మూర్తి ఎస్ఎస్ఎస్ చావాలి యాదవ్ మాట్లాడుతూ నానో టెక్నాలజీ వినియోగం రసాయనశాస్త్రంలో విస్తృతమైందన్నారు. నూతన అంశాల ఆవిష్కరణతో పాటుగా పలు సమీకరణాలకు నానో టెక్నాలజీని వినియోగిస్తున్నారని వివరించారు. నానో పదార్థాలను వైద్యం, విద్యుత్ పరికరాల తయారీలో, పర్యావరణ పరిరక్షణకు వినియోగిస్తున్నారన్నారు. వైద్యరంగంలో సూక్ష్మజీవుల సంహారకాలుగా, మందులను శరీరంలో ప్రవేశపెటేట కారకాలుగా వినియోగిస్తున్నారని వివరించారు. విద్యుత్ రంగంలో పాక్షిక విద్యుత్ వాహకాలుగా బయో సెన్సార్లను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు నానో టెక్నాలజీ చాలా కీలకమైనదిగా చెప్పారు. విద్యార్థులు ఈ రంగంలో ఉన్న నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేసి తద్వారా మరిన్ని నూతన అంశాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించి జరిగే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఒ. శైలజ, డాక్టర్ కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరం



వైద్య శిబిరంలో బీపీ చెకప్ చేయించుకుంటున్న సీపీ రాజశేఖరబాబు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్:పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను వివిధ అంశాలపై రూపొందించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే పోలీసుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అను ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించామని తెలిపారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో రుమటాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ, కార్డియాలజీ, డయాగ్నోసిస్ పరీక్షలు, పీడియాట్రిక్స్, బీపీ, షుగర్, ఈసీజీ, డెంటల్, కంటి, 2డీ ఎకో వైద్య పరీక్షలను పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించామన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అను ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి వివరించారు. డీసీపీలు గౌతమి సాలి, తిరుమలేశ్వరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, ఉదయరాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్యం దుకాణాలు తొలగించాలి



వీఎంసీ సీఈకి వివరిస్తున్న పాతబస్తీ వాసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):స్థానికులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ మద్యం దుకాణాలను తొలగించాలని పాతబస్తీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొని చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయి సత్యబాబు, స్థానిక ప్రముఖులు కొరగంజి జగన్నాథరావుపాత్రుడు, మొహమూద్ తదితరులు మాట్లాడుతూ గులాంమొహిద్దీన్ వీధిలో మూడు రోజుల క్రితం కొత్తగా ప్రైవేట్ మద్యం దుకాణాన్ని ప్రారంభించారన్నారు. దీని వలన స్థానిక నివాసితులు, వ్యాపార సంస్థలు, ఫంక్షన్ హాల్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి దుకాణాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పోలీస్ కమిషనర్‌ను సైతం కలిసి వారి వినతిపత్రాన్ని అందించారు.

పార్కింగ్ ఫీజు వసూలు తగదు

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటో కార్మికుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు తగదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. గుడ్స్ ఆటోవర్క్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డు రథం సెంటర్‌లో సోమవారం వార్షికోత్సవం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోటేశ్వరరావు హాజరై జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాతబస్తీలోని వ్యాపార సముదాయాలు నుంచి ప్రజలు కొనుగోలు చేసిన సామగ్రిని తీకెళ్లాలంటే గూడ్స్ ఆటో సౌకర్యం ఉండాల్సిందేనన్నారు. కెనాల్ రోడ్డులోని పార్కింగ్ ఫీజులతో విచ్చలవిడిగా వారు తోచిన పద్ధతిలో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 50 నుంచి 100 రూపాయాల వరకు వసూలు చేస్తున్నారన్నారని చెప్పారు. ఈ వసూళ్లు కాంట్రాక్టర్ ద్వారా జరుగుతోందన్నారు. అంతేకాకుండా 20 సంవత్సరాలుగా ఆటో కార్మికులు జీవనం సాగిస్తున్నా వారిని కూడా పార్కింగ్ ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారని, అది సరైన విధానం కాదన్నారు. నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్పందించి ఉపాధి జీవనం కొనసాగించే ఆటో కార్మికుల నుంచి పార్కింగ్ ఫీజు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఎంసీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి




నగరవాసుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ సీఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. వీఎంసీ కమిషనర్ ఆదేశాలతో సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 ఫిర్యాదులను స్వీకరిచారు. పట్టణ ప్రణాళిక విభాగంపై -6, ప్రజారోగ్యం-2, ఇంజినీరింగ్-1. రెవిన్యూ విభాగం-1 ఫిర్యాదులను స్వీకరించారు. డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ పి.సత్యనారాయణ, పి. సత్య కుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న భవానీ ద్వీపం

- వరదకు కూలిన భారీ వృక్షాల తొలగింపు
- వరదకు కోసేసిన నదీ తీరంలో ఇసుక బస్తాలు
- పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించే దిశగా చర్యలు



కోసుకుపోయిన ద్వీపం అంచుల్లో డంప్ చేస్తున్న ఇసుక బస్తాలు



కూలిన భారీ వృక్షాలను మెషిన్లతో కట్ చేసి తొలగిస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్తీక మాసం అంటే వనసమారాధన గుర్తుకు వస్తుంది. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి వనసమారాధన నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందుకు భవానీపురంలోని భవానీ ద్వీపం ప్రధాన వేదికగా నిలుస్తుంది. ఇందు కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజిని కూడా ప్రకటిస్తుంది. అయితే ఇటీవల సంభవించిన వరదతో అతలాకుతలమైన భవానీ ద్వీపంలో ఈ ఏడాది కార్తీక వనసమారాధన జరుకునేందుకు వీలుగా తీవ్రంగా దెబ్బతిన్న ద్వీపం పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చర్యలు చేపట్టింది. ఒక వైపు వరద మరో వైపు భారీ వర్షాల కారణంగా ద్వీపంలోని భారీ వృక్షాలు కూకటి వేళ్లతో సహా కూలిపోయి అడ్డదిడ్డంగా (పాత్ వే మార్గం) పడిపోయిన సంగతి తెలిసిందే. గత ఐదు రోజుల నుంచి వాటిని మెషిన్ల ద్వారా కట్ చేసి తొలగించి పాత్ వేలను సుగమం చేస్తున్నారు. అదే విధంగా వరద ప్రభావంతో ద్వీపంలో వేసిన ఇసుక మేటల నుంచి సేకరించిన ఇసుకను సిమెంట్ సంచుల్లో నింపి వరద ఉధృతికి కోసుకుపోయిన కృష్ణానదీ తీరంలో (ద్వీపం అంచులు) డంప్ చేస్తున్నారు. ద్వీపంలో ఏపుగా పెరిగిన గడ్డిని మెషిన్ ద్వారా కట్ చేయటం, క్రోటన్ మొక్కలను కట్ చేసి పచ్చదనం ఉట్టిపడేలా లాన్‌ను సిద్ధం చేస్తున్నారు. పర్యాటకులతోపాటు కార్తీక వనసమారాధన జరుపుకునేందుకు వచ్చే బృందాలకు ఆహ్లాదాన్ని అందించే దిశగా ద్వీపాన్ని తీర్చిదిద్దుతున్నామని ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పీ కృష్ణచైతన్య తెలిపారు. సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో కార్తీక వనసమారాధన ప్రత్యేక ప్యాకేజిన ప్రకటించనున్నట్లు చెప్పారు.



పెరిగిన గడ్డిని తొలగించి పచ్చదనంతో కూడిన లాన్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

మూతబడిన యాక్టివిటీస్...

భవానీ ద్వీపంలో కొంత మేర ఏపీటీడీసీ పరిధిలో ఉండగా మరి కొంత భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) పరిధిలో ఉంది. ఏపీటీడీసీ పరిధిలో పునరుద్ధరణ చర్యలు చురుగ్గా సాగుతుండగా బీఐటీసీ పరిధిలో మాత్రం ఇంత వరకు విద్యుత్ సరఫరా లేకపోవడం గమనార్హం. దీంతో ద్వీపానికి వచ్చే పర్యాటకులు ఆడుకునే యాక్టివిటీస్ మూతపడ్డాయి. వరద ప్రభావంతో కరెంట్ నిలిచిపోయి రెండు నెలలు కావస్తున్నా బీఐటీసీ అధికారుల నిర్లక్ష్యం వలనే ఇప్పటికీ కరెంట్ లేదని సిబ్బంది చెబుతున్నారు. కార్తీక మాసంలో ద్వీపానికి వచ్చే పర్యాటకులు/సందర్శకులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీకి సత్కారం



బాలాజీని సత్కరిస్తున్న అఖిల భారత యాదవ మహాసభ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూకసాని బాలాజీని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆటోనగర్‌లోని ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి చెందిన తనకు ఈ పదవి బాధ్యతలను అప్పగించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ నూకసాని బాలాజీని సత్కరించినవారిలో యాదవ మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సోంప్రకాష్, రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి, జాతీయ నాయకులు పి.మాలకొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్, ఆవుల వీర శేఖర్, మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, యువజన నేత డాక్టర్ ఉమాపతి, దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.